# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా అదనపు న్యాయమూర్తి అమరావతి

హుజూర్‌నగర్, డిసెంబర్ 15 : ఈ నెల 30వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి అమరావతి కోరారు. హుజూర్‌నగర్‌లోని కోర్టు హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అదనపు జిల్లా కోర్టు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీ న్యాయ స్థానాల్లో రాజీకి అనుకూలమైనవి క్రిమినల్ 9,347, సివిల్ 3,495 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులను లోక్ అదాలత్ ద్వారా కోర్టులో పరిష్కరించుకోవడానికి కక్షిదారులకు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎస్‌ఐలు చొరవ తీసుకోని లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా శ్రద్ధ చూపాలని కోరారు. గత లోక్ అదాలత్‌లో సూర్యాపేట జిల్లాలో ఎక్కువ కేసులు హుజూర్‌నగర్ నుంచే పరిష్కరించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గతం కంటే ఎక్కువ కేసులను రాజీ చేయించి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి అమరావతి

## రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా బీర్ల అయిలయ్య

(మొదటి పేజీ తరువవాయి)

కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గానికి చెందిన అయిలయ్యకు సముచిత స్థానం కట్టబెట్టింది. ప్రభుత్వ విప్‌గా నియమితులైన బీర్ల అయిలయ్య శుక్రవారం పలువురు మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారం, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిశారు. వారికి యాదగిరిగుట్ట స్వామివారి ప్రసాదం, చిత్రపటాలను అందజేసి పలు అంశాలపై చర్చించారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

గరిడేపల్లి, డిసెంబర్ 15 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనులు సరిగా లేక వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. కావున వారికి పని వసతి కల్పించాలి ఆదుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

## సంపద వనాల్లో మొక్కలు సంరక్షించాలి

● ఎంపీపీ ఎలక బిందు

మునగాల, డిసెంబర్ 15 : సంపద వనాల్లోని మొక్కలు సంరక్షించాలని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని కృష్ణానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలు పరిశీలించి మాట్లాడారు. సంపద వనాల వల్ల గ్రామ పంచాయతీలకి భవిష్యత్‌లో ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ శైలజ, సినియర్ అసిస్టెంట్ యాసిన్ పాల్గొన్నారు.



మునగాల : సంపద వనాల్లో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీపీ బిందు

### మఠంపల్లి గ్రామ నర్సరీ పరిశీలన

మఠంపల్లి : మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తాసీల్దార్ మంగారాథోడ్ అన్నారు. శుక్రవారం ఆయన మఠంపల్లి గ్రామ నర్సరీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

● నీటి పారుదల శాఖ డీఈ అమరేందర్‌రెడ్డి



ఊర చెరువును పరిశీలిస్తున్న ఎన్‌ఎస్‌పీ డీఈ అమరేందర్‌రెడ్డి

నేరేడుచర్ల, డిసెంబర్ 15 : చెరువులు, కుంటలు, కాల్వలను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ డీఈ అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలోని ఊర చెరువును కొంత మంది మట్టిపోసి ఆక్రమిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శుక్రవారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల కబ్జాతో దాని సామర్థ్యం తగ్గిపోయి నీరు అడుగంటి పోతుందన్నారు. చెరువును ఆక్రమించిన వారిపై తాసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువు సొసైటీ సభ్యులు తమ చెరువులను పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఎన్‌ఎస్‌పీ ఏఈ రాజేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, లస్కర్ రాచూరి నగేశ్, టీడీపీ మండలాధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, సొసైటీ సభ్యులు నాగయ్య, యడవల్లి వెంకటకృష్ణ, యాగాని వెంకటరమణ ఉన్నారు.



కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

## శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 15 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

నేరేడుచర్ల, డిసెంబర్ 15 : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 4వ వార్డు రాజీవ్‌నగర్‌లో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతా లోపం లేకుండా సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ జానకిరాములు, బీఆర్‌ఎస్ నాయకుడు పాపగంటి సామేలు పాల్గొన్నారు.

## కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలి : బీజేపీ

కోదాడ రూరల్, డిసెంబర్ 15 : నూతన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని బీజేపీ నియోజవర్గ కన్వీనర్ కనగాల నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో అనేక మంది ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నారన్నారు. కావున వెంటనే కార్డులు జారీ చేసి వారిని ఆదుకోవాలని కోరారు.



ధర్నాలో పాల్గొన్న పోస్టాఫీస్ ఉద్యోగులు

## పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నడిగూడెం, డిసెంబర్ 15 : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట గల ప్రధాన రహదారిపై పోస్టల్ ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 8గంటల పని దినాలు కేటాయించడంతో పాటు, పెన్షన్ మంజూరు చేయాలని, అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమలేశ్చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పోస్టాఫీస్ ర్యాలీకి తరలివెళ్లారు. కార్యక్రమంలో నజీరుద్దీన్, ఉప్పలయ్య, దున్నా వీరబాబు, ఉప్పలయ్య, శరత్ పాల్గొన్నారు.

## ముగిసిన భవన నిర్మాణ రంగ శిక్షణ

నడిగూడెం, డిసెంబరు 15 : న్యాక్ ఆధ్వర్యంలో మండలంలోని సిరిపురం గ్రామంలో భవన నిర్మాణ రంగంపై 15రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కార్మికులకు శిక్షణ ఇచ్చిన నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.

## మెట్ట పంటలపై రైతులు దృష్టి సారించాలి : ఏడీఏ

కోదాడ రూరల్, డిసెంబర్ 15 : రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటుగా తక్కువ నీటి లభ్యతకు అనుకూలమైన మెట్ట పంటలపై దృష్టి సారించాలని కోదాడ డివిజన్ ఏడీఏ వాసు అన్నారు. మండలంలోని గుడిబండ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో మొక్కజొన్న వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు.



కోదాడలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

## పొట్టి శ్రీరాములుకు నివాళి

నేరేడుచర్ల / కోదాడ రూరల్ / మునగాల / నడిగూడెం, డిసెంబర్ 15 : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పలువురు నాయకులు శుక్రవారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. నేరేడుచర్ల పట్టణంలోని చౌరస్తా వద్ద వాసవీ, వనితా క్లబ్ సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోదాడ పట్టణంలోని పాత మండల పరిషత్ కార్యాలయం, పట్టణ ప్రధాన రహదారిపై ఆయన విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునగాల మండలంలో వాసవీ క్లబ్ నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు కాపర్తి మణికంఠకుమార్, చక్కా కిశోర్, నల్లపాటి శ్రీనివాస్, పీవీడీ ప్రసాద్, వాసా శ్రీనివాస్, చిల్లంచర్ల శ్రీనివాస్, పాల్గొన్నారు. నడిగూడెం మండల కేంద్రంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**WANTED**
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**FLAT FOR SALE**
★ HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059